విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో ప్రజా ఆదరణ పొందుతున్న ప్రజా ముద్ర న్యూస్ ఛానల్ మరియు పత్రిక నందు పనిచేయుటకు అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు మరియు మండలాలు వారీగా రిపోర్టర్స్ (విలేకర్లు) కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి
95738 00809

ప్రజా ముద్ర
తెలుగు డిజిటల్ దినపత్రిక
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం !
PRAJA MUDRA NEWS
Follow /

సంపుటి: 01 సంచిక: 328 సంపాదకులు కె. నరేష్ కుమార్ 04 మంగళవారం ఆగస్టు 2026 పేజీలు: 8 వెల: రూ. 3/-

Published from , Nizamabad, Hyderabad, Rangareddy, Warangal, Medak, Mahabub Nagar, Mahabubabad, Khammam, Karimnagar, Nalgonda, Adilabad



# రైతులకు నిరాశే

**ఆగస్టులోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం**
**పసిఫిక్ సముద్రంలో ఎల్ నినో ప్రభావం**
**రాబోయే 3 రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు**
**'ఎల్ నినో' దెబ్బ..**
**నైరుతి రుతుపవనాలకు బ్రేక్**
**ఆగస్టులో 94 శాతం వరకు తగ్గే అవకాశం: వాతావరణ శాఖ హెచ్చరిక**
**కొడంగల్‌లో కుండపోత.. 24 గంటల్లో 10.4 సెం.మీ వర్షపాతం**
**జూలైలోనూ లోటు వర్షపాతమే: సగటు కంటే తక్కువగా నమోదు**
**హిమాలయాల వైపు పయనిస్తున్న రుతుపవన ద్రోణి**
**పలు జిల్లాల్లో తేలికపాటి వర్ష సూచన**

హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి: ఈ ఏడాది ఆగస్టు నెలలో కూడా దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ శాటిలైట్ చిత్రాల ఆధారంగా వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రంపై మోస్తరు ఎల్ నినో ప్రభావం కొనసాగుతుండటంతో నైరుతి రుతుపవనాలు ఎప్పుడైనా బలహీనపడవచ్చునని అధికారులు అంచనా వేశారు.

జూలై నుంచి కొనసాగుతున్న వర్షాల లోటు

ఈ ఏడాది ఆగస్టు నెల కూడా లోటు వర్షపాతంతోనే ప్రారంభమైందని, సోమవారం వరకు దేశవ్యాప్తంగా కేవలం 10.3 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైందని అధికారులు తెలిపారు. జూలై నెలలో సాధారణంగా 227.4 మి.మీ సగటు వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 224 మి.మీ మాత్రమే నమోదైనట్లు వెల్లడించారు. ఎల్ నినో కారణంగా ఆగస్టులో సాధారణ వర్షపాతం కంటే ఏకంగా 94 శాతం వరకు తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

బలహీనపడిన ద్రోణి.. తెలంగాణలో

మిగతా 2లో



# సర్వోన్నత న్యాయస్థానానికి మరిన్ని 'న్యాయ' శక్తులు

**సభలో హోరెత్తిన నినాదాలు.. సైలెంట్‌గా గట్టెక్కిన బిల్లు!**
**76 ఏళ్లలో 375% పెంపు**
**చరిత్ర పుటల్లో సుప్రీంకోర్టు సంఖ్యా బలం**
**2026 తొలి ఆర్డినెన్స్‌కు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్**

2

సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన కీలకమైన లిలి'సుప్రీం కోర్టు జడ్జిల సంఖ్య సవరణ బిల్లు-2026'లిలికు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా సీజేఐ సహా సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య ప్రస్తుతమున్న 34 నుంచి 38కి పెరగనుంది.



# పాదచారులకు ప్రత్యేక మార్గం ఉండాల్సిందే

**ఫుట్‌పాత్‌లపై నడక.. ప్రాథమిక హక్కు**
**వాహనాల బెడదకు అడ్డుకట్ట వేయాలి**
**రోడ్డుపై కనీసం తాడు అయినా కట్టండి**
**ప్రయాణికుల భద్రతపై అత్యున్నత న్యాయస్థానం కీలక సూచనలు**

2

# 'హుండీ' ప్రదర్శనతో హోరెత్తిన పార్లమెంట్

**ప్రభుత్వాన్ని కడిగేసిన ప్రియాంక గాంధీ, మహువా మొయిత్రా**
**అయోధ్య సొమ్ము ఏమైంది?**
**సభ బయట విరాళాల పెట్టెలతో ఎంపీల ఊరేగింపు**
**కేంద్రానికి ప్రతిపక్షాల 'చోరీ' షాక్**
**మకర ద్వారం ముందు డ్రామాటిక్ నిరసన**
**అమిత్ షా టార్గెట్‌గా బ్యానర్లు**
**సభకు రాకపోవడంపై విపక్ష నేతల తీవ్ర నిరసన**

2



# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం



2

**'ఫ్యూచర్ సిటీ'తో మారునున్న తెలంగాణ రూపురేఖలు**
**ప్రవాస భారతీయులకు బంపర్ ఆఫర్**
**పెట్టుబడులకు 'సింగిల్ విండో' గ్రీన్ సిగ్నల్**
**రూ. 200 కోట్లతో 'యంగ్ ఇండియా' స్కూళ్లు**
**విద్యారంగంలో సంచలనాత్మక మార్పులు**
**అమెరికాలో 19వ 'ఆటా' వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

# హైదరాబాద్‌లో బ్రిక్స్ అవినీతి నిరోధక సదస్సు

**నేటి నుంచి ప్రతిష్ఠాత్మకంగా ఏసీడబ్ల్యూజీ, ఆస్తుల రికవరీ సమావేశాలు**
**సాంకేతిక పరిజ్ఞానంతో అవినీతికి చెక్ పెట్టడమే లక్ష్యం**
**ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిపై సభ్య దేశాల చర్చలు**

హైదరాబాద్ :బ్రిక్స్ -2026 అధ్యక్షత వహిస్తున్న భారతదేశ నేతృత్వంలో 'బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం' రెండో సమావేశం, అలాగే 'ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్' రెండో సమావేశం ఆగస్టు 4, 5 తేదీల్లో నగరంలో ఘనంగా ప్రారంభం కానున్నాయి. కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సమావేశాలకు బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు, విధాన రూపకర్తలు, అవినీతి నిరోధక సంస్థల ప్రతినిధులు, చట్ట అమలు సంస్థల ఉన్నతాధికారులు హాజరవుతున్నారు. ఈ సదస్సును డీవోపీటీ కార్యదర్శి రచనా షా ప్రారంభించనున్నారు.

'స్థిరత్వం, ఆవిష్కరణ' ఇతివృత్తంగా చర్చలు

"స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే బ్రిక్స్--2026 ప్రధాన

మిగతా 2లో



2

# దానయ్య మృతి కేసులో మలుపు..

**కస్టడీకి మాజీ మంత్రి సీదిరి**
**మంగళవారం ఉదయం 9 నుంచి 5 వరకు అప్పలరాజును ప్రశ్నించనున్న పోలీసులు**
**ఆంపోలు జైలు నుంచి పోలీస్ కస్టడీలోకి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు**

# అంబరాన్నంటిన 'రంగం' సంబరం

**పచ్చి కుండపై నిలిచి సంకేతాలు ఇచ్చిన భవిష్యవాణి**
**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి: మంత్రి పొన్నం ప్రాంజలి**
**జనసందోహమైన సికింద్రాబాద్: కట్టుదిట్టమైన భద్రత**



సికింద్రాబాద్, ఆగస్టు 03: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యమైన 'రంగం' కార్యక్రమం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక శోభ నడుమ వైభవంగా జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకను వీక్షించేందుకు నగర నలుమూలల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

పచ్చి మట్టి కుండపై అమ్మవారి ఆవాహన.. 'భవిష్యవాణి'

బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'రంగం' కార్యక్రమంలో భాగంగా మాతంగి స్వర్ణలత పచ్చి మట్టి కుండపై నిలబడి అమ్మవారిని ఆవాహన చేసుకున్నారు. అనంతర పరిణామాలపై, రాబోయే రోజుల్లో జరిగే విషయాలపై అమ్మవారి 'భవిష్యవాణి'ని భక్తులకు వినిపించారు. ఈ సాంప్రదాయ ఘట్టాన్ని వీక్షించిన భక్తులు అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించారు.

ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక

మిగతా 2లో

# కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ ఒక పెద్ద మోసం

**డిప్యూటీ సీఎం సొంత జిల్లాలోనే నిరుద్యోగి ఆత్మహత్యాయత్నం**
**రెండేళ్లలో పదివేల ఉద్యోగాలు కూడా ఇవ్వని రేవంత్ సర్కార్**
**లాఠీచార్జ్‌లు జరుగుతున్నా కాంగ్రెస్ హైకమాండ్ మౌనం ఏల?**
**అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ తీరును ఎండగడతాం**
**తెలంగాణ ఇంజినీర్లను అవమానించడం తగదు**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



2

## రైతులకు నిరాశే..

రాబోయే 3 రోజుల వాతావరణం
సముద్రమట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి ప్రస్తుతం బికనీర్, ఢిల్లీ, లక్నో, పాట్నా మీదుగా మణిపూర్ వైపు విస్తరించి ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు ఉత్తర అంతర్గత కర్ణాటక నుంచి కేరళ, తమిళనాడు మీదుగా ఉన్న ద్రోణి బలహీనపడింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.
గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, సూర్యాపేట తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో 10.43 సెం.మీ, కామారెడ్డి జిల్లా పిట్లంలో 10.38 సెం.మీ, సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో 8.40 సెం.మీ, హైదరాబాద్ బండ్లగూడలో 7.78 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## 'హుండీ' ప్రదర్శనతో హోరెత్తిన పార్లమెంట్

న్యూఢిల్లీ ఆగస్టు 03:అయోధ్య రామమందిరం విరాళాల చోరీ ఉదంతం, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల బలప్రయోగం ఘటనలపై పార్లమెంట్ ప్రాంగణం తీవ్ర ఉద్రిక్తంగా మారింది. వీటిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు సోమవారం కూడా తమ నిరసనను ఉధృతం చేశారు.
మకర ద్వారం వద్ద వినూత్న నిరసన
పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం వద్ద విపక్ష ఎంపీలు భారీ ఎత్తున పోస్టర్లు, బ్యానర్లతో నిరసన చేపట్టారు. రామమందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా ఆవరణలో పెద్ద విరాళాల పెట్టెలను ఉంచారు. ఎంపీలు వాటి చుట్టూ బారులు తీరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో నినాదాలు చేశారు. కొందరు ఎంపీలు ఆ పెట్టెలలో నగదు వేసి, అనంతరం లెక్కింపు సమయంలో చోరీ ఎలా జరుగుతుందో ప్రతీకాత్మకంగా ప్రదర్శించి అందరి దృష్టినీ ఆకర్షించారు.
రంగంలోకి దిగిన ముఖ్య నాయకులు
ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, జేఎంఎం ఎంపీ మహువా మాఝీ, ఆర్ఎస్పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితర విపక్ష నేతలు పాల్గొన్నారు
"హోంమంత్రి సమాధానం చెప్పాలి
"కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు ఎందుకు రావడం లేదు?" అని ప్రశ్నిస్తూ రాసిన ఒక పెద్ద బ్యానర్‌ను ఎంపీలు ప్రదర్శించారు. పవిత్రమైన విరాళాల చోరీపై, విద్యార్థులపై జరిగిన దాడులపై హోంమంత్రి స్వయంగా సభకు వచ్చి స్పష్టత ఇవ్వాలని నిరసనకారులు గట్టిగా డిమాండ్ చేశారు.

## పాదచారులకు ప్రత్యేక మార్గం ఉండాల్సిందే:

న్యూఢిల్లీ ఆగస్టు 03:దేశంలో రహదారులపై పాదచారులకు సరైన ప్రయాణ మార్గాలు లేకపోవడం వల్ల వరుస ప్రమాదాలు జరుగుతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఫుట్‌పాత్‌లపై స్వేచ్ఛగా, సురక్షితంగా నడవడమనేది పౌరుల ప్రాథమిక హక్కులలో భాగమని అత్యున్నత న్యాయస్థానం తెగేసి చెప్పింది. రహదారులు ఉన్న ప్రతిచోటా పాదచారుల కోసం ఆక్రమణలు లేని ప్రత్యేక స్థలాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.
**వాహనాల మార్గం వేరు.. నడిచే మార్గం వేరు**
మోటార్ వాహనాలు ప్రయాణించే రోడ్లకు, పాదచారులు నడిచే దారులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉండాలని ధర్మాసనం పేర్కొంది. స్థల పరిమితి వల్ల విడిగా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయడం సాధ్యం కాని ప్రదేశాలలో, కనీసం రోడ్లకు మరియు ప్రజలు నడిచే ప్రాంతానికి నడుమ తాడు లేదా నిరోధకాలను అయినా కట్టాలని సూచించింది.
పౌరుల్లో నమ్మకం కలిగించాలి
"రహదారుల పక్కన ఉండే ఖాళీ స్థలం తమ కోసమేనని, వాహనాల బెడద లేకుండా స్వేచ్ఛగా నడవగలమని పాదచారులలో పూర్తి నమ్మకాన్ని కలిగించాలి."
--- సుప్రీంకోర్టు వ్యాఖ్య
**కేంద్రానికి రెండు వారాల గడువు**
పాదచారుల భద్రత కోసం తీసుకున్న చర్యలు మరియు చేసిన ఏర్పాట్లపై సమగ్ర నివేదికను సమర్పించేందుకు సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి రెండు వారాల గడువు ఇచ్చింది. అనంతరం ఈ అంశంపై తదుపరి విచారణ జరుపుతామని స్పష్టం చేస్తూ కేసును వాయిదా వేసింది.

## సర్వోన్నత న్యాయస్థానానికి మరిన్ని 'న్యాయ' శక్తులు

న్యూఢిల్లీ ఆగస్టు 03:సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన కీలకమైన లిలి'సుప్రీం కోర్టు జడ్జిల సంఖ్య సవరణ బిల్లు-2026'లిలికు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా సీజేఐ సహా సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య ప్రస్తుతమున్న 34 నుంచి 38కి పెరగనుంది.
వర్షాకాల సమావేశాల్లో భాగంగా కేంద్ర కేంద్ర నియమ, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఈ బిల్లుపై చర్చను ప్రారంభించారు. అయితే, విపక్ష సభ్యుల వరుస నిరసనలు, నినాదాల నడుమ స్పీకర్ చర్చ లేకుండానే బిల్లును ఆమోదింపజేశారు. అనంతరం సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు.
**ఆర్డినెన్స్ నుంచి చట్టం రూపంలోకి..**
సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించేందుకు జడ్జీల సంఖ్యను పెంచాలని ఈ ఏడాది మే నెలలోనే కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. దానికి కార్యరూపం ఇస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము లిలి'ద సుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్-2026'లిలిను జారీ చేశారు. 2026 సంవత్సరంలో కేంద్రం జారీ చేసిన తొలి ఆర్డినెన్స్ ఇదే కావడం విశేషం. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందడంతో ఇది చట్టరూపం దాల్చనుంది.
**76 ఏళ్ల ప్రయాణంలో 375% పెంపు**
ח 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సమయంలో కేవలం 8 మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు ప్రారంభమైంది. గడిచిన 76 ఏళ్ల ప్రయాణంలో జడ్జీల సంఖ్య నిష్పత్తి ప్రకారం 375 శాతం పెరగడం గమనార్హం.

## అంబరాన్నంటిన 'రంగం' సంబరం

పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ --- "రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, కాలం కలిసి వచ్చి మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని మహంకాళి అమ్మవారిని ప్రార్థించాను. బోనాల పండుగ మన తెలంగాణ ఆత్మగౌరవానికి, విశిష్ట సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం" అని పేర్కొన్నారు.
కట్టుదిట్టమైన భద్రత.. భక్తులకు కల్పించిన మెరుగైన వసతులు
ఈ వేడుకల్లో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు క్యూలైన్లు, తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులను కల్పించడమే కాకుండా, పోలీసు విభాగం ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

## దానయ్య మృతి కేసులో మలుపు..

అమరావతి ఆగస్టు 03: వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల కాపరి దానయ్య మృతి కేసులో నిందితుడిగా ఉన్న ఆయనను పోలీస్ కస్టడీకి ఇస్తూ శ్రీకాకుళం జిల్లా పలాస కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఒక్కరోజు పాటు ఆయనను పోలీస్ కస్టడీకి అనుమతించింది.
ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణ
కోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలీసులు అప్పలరాజును కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. దానయ్య మృతి కేసులోని కీలక అంశాలు, సంఘటన వెనుక ఉన్న కారణాలపై పోలీసులు ఆయనను ప్రశ్నించే అవకాశం ఉంది.
ప్రస్తుతం ఆంపోలు జైలులో రిమాండ్ ఖైదీగా..ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఆంపోలు సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కోర్టు కస్టడీకి అనుమతించడంతో పోలీసులు ఆయనను జైలు నుంచి తీసుకువెళ్లి విచారణ జరపనున్నారు.

## అరాచక శక్తులకు జగన్ బాసట

అమరావతి ఆగస్టు 03:వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళిత, బీసీ వర్గాలకు చెందిన మహిళల పట్ల దుశ్శాసనుడిలా ప్రవర్తించి, దుస్తులు చింపిన వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి చేసిన ఘోరాన్ని ఖండించకపోగా... జగన్ రెడ్డి సిగ్గులేకుండా సమర్థిస్తున్నారని నిప్పులు చెరిగారు. సోమవారం అమరావతి వేదికగా మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన, కక్షసాధింపు ధోరణిపై విరుచుకుపడ్డారు.
**"గొడ్డలి పార్టీలో అరాచకాలే అర్హత!"**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర యువత భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే, వైసీపీ మూకలు వారి జీవితాలను నాశనం చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు.
"ప్రజాసేవ కాదని.. అరాచకాలు, నేరాలు చేయడమే ఆ పార్టీలో కొనసాగడానికి ముఖ్య అర్హత. ఎంత పెద్ద అరాచకాలు సృష్టిస్తే జగన్ వద్ద అంత పెద్ద ప్రాధాన్యం లభిస్తుంది. నేరాలు చేసి దొరికిపోయాక 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సింపతీ డ్రామాలు ఆడటం వారికి అలవాటే."
--- కొలుసు పార్థసారథి, ఏపీ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి
శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు!
శ్రీకాకుళంలో మహిళా పోలీసు పట్ల దారుణంగా ప్రవర్తించడమే కాకుండా, బలహీన వర్గానికి చెందిన యువకుడిని ప్రాణాలు పోయేలా కొట్టారని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడకూతురిపై రాక్షస దాడికి తెగబడిన దుశ్శాసనుడిని... బాధితుడిగా చిత్రీకరించేందుకు వైసీపీ శ్రేణులు యత్నిస్తున్నాయని విమర్శించారు. దళిత, బీసీ మహిళపై దాడికి తెగబడిన ఎమ్మెల్యేను ఖండించకపోవడం దారుణంమహిళా పోలీసు, హోంమంత్రి, సీఎంను అవమానించినా స్పందించరా?శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్క అరాచక శక్తిని వదిలేది లేదుప్రజలు తీవ్రంగా తిరస్కరించి గద్దె దించినా వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని, దళిత వర్గాలకు చెందిన మహిళల దుస్తులు చింపేంతటి నీచమైన సంస్కృతిని జగన్ ఎందుకు ఖండించడం లేదని పార్థసారథి నిలదీశారు.

## పార్టీకి ఆయువు పట్టు కార్యకర్తలే...

మంగళగిరి ఆగస్టు 03:తెలుగుదేశం పార్టీ శ్రేణులను సమర్థవంతమైన ప్రజా నాయకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం (ఎన్టీఆర్ భవన్)లో యూనిట్ ఇన్‌ఛార్జుల శిక్షణా తరగతులు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, తెదేపా సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సంస్థాగత బలోపేతంతో పాటు ప్రజలతో మరింత సన్నిహితంగా మమేకమై పార్టీ కార్యక్రమాలను గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు.
**కార్యకర్తలే పార్టీకి అసలైన బలం!**
ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ బలం కేవలం నాయకుల్లో కాదని, నిస్వార్థంగా శ్రమించే కార్యకర్తల్లోనే ఉందని స్పష్టం చేశారు.
"గ్రౌండ్ లెవల్ నుంచి పార్టీని బలోపేతం చేయడంలో ప్రతీ కార్యకర్త పాత్ర అత్యంత కీలకం. చంద్రబాబు, లోకేష్‌ల నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేసి ప్రజల విశ్వాసాన్ని మరింత పటిష్టం చేయాలి."--- దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి
నాయకత్వ నైపుణ్యాలు - శిక్షణ ముఖ్యాంశాలు
కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, ఇన్‌ఛార్జులకు పలు కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం శ్రమించే నాయకుడిగా ఎదగాలి. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించాలి.కుటుంబ సాధికార సారథులు, బూత్ కమిటీలు, యూనిట్ ఇన్‌ఛార్జులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకాల సమగ్ర సమాచారం అందించాలి.
**'ఇంటింటికీ తెలుగుదేశం' దిశగా అడుగులు**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల సమర్థ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని దేవినేని ఉమ కొనియాడారు. కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేస్తూ 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణా తరగతుల్లో పార్టీ ముఖ్య నాయకులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి కార్యకర్తలు, కుటుంబ సాధికార సారథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం..

వాషింగ్టన్/హైదరాబాద్ ఆగస్టు 03:అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ నగరంలో నిర్వహించిన 19వ అమెరికా తెలుగు సంఘం (ఆటా) జాతీయ మహాసభల్లో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విదేశాల్లో స్థిరపడి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలు సాధించిన ప్రవాస భారతీయులు తమ మాతృభూమి, సొంత గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.
పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం: 'సింగిల్ విండో'తో వేగవంతమైన అనుమతులు
తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే ఎన్ఆర్ఐలకు 'సింగిల్ విండో' విధానం ద్వారా ఎలాంటి వేధింపులు లేకుండా వేగవంతంగా అనుమతులు అందజేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అత్యంత అనుకూల వాతావరణం కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రవాసులు చేపట్టే పారిశ్రామిక, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని విధాలా మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.
భారీ ప్రాజెక్టులతో బహుముఖ అభివృద్ధి
2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా ప్రణాళికలు రచించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఐటీ, పారిశ్రామిక, సేవా రంగాలతో పాటు 56 కిలోమీటర్ల మేర మూసీ నది ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్ (===), ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక పురోగతికి ఊపిరిపోస్తాయని అన్నారు.
అలాగే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ, 100 నియోజకవర్గాల్లో ఒక్కోటి 25 ఎకరాల విస్తీర్ణంలో, రూ.200 కోట్ల అంచనా వ్యయంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రవాస భారతీయులు, వారి కుటుంబాల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధ అధికారాలు కలిగిన ప్రత్యేక వ్యవస్థను త్వరలోనే ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ ఒక పెద్ద మోసం

హైదరాబాద్ ఆగస్టు 03:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులను దారుణంగా మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, కాళేశ్వరం, సాగునీటి ప్రాజెక్టులు, మెట్రో మరియు రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.
రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు
ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ గొప్పలు చెప్పిందని, తీరా అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ అమలును పూర్తిగా గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. గత రెండేళ్ల కాలంలో కనీసం పదివేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేకపోయారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గానికి చెందిన ఓ నిరుద్యోగి ఉద్యోగం రాక ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర విచారకరమని, ఆ యువకుడి సూసైడ్ నోట్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు.
"నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి:"
"ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుద్యోగ యువత ఆత్మహత్యల బాట పట్టవద్దు. ప్రాణాలు కోల్పోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే కాంగ్రెస్ సర్కార్‌పై పోరాడదాం. బీఆర్ఎస్ పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుంది."
--- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
ఇంజనీర్ల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీర్లపై చేసినట్లు వస్తున్న వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని రోడ్లు, ఫ్లైఓవర్లు, ఆధునిక భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు అన్నీ మన ఇంజనీర్ల రక్తం, చెమటతో నిర్మించబడ్డాయని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతిభ చాటుతున్న తెలంగాణ ఇంజనీర్లను అవమానించడం సరికాదని, సీఎం వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ఎండగడతాం
రాష్ట్రంలో గురుకులాల నిర్వహణ అధ్వానంగా తయారైందని, విద్యార్థులపై లాఠీచార్జీలు జరుగుతున్నా కాంగ్రెస్ అగ్రనాయకత్వం స్పందించడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఐటీ ఉద్యోగాల కోత, బీసీ రిజర్వేషన్లు, గోదావరి జలాల నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగులు, రైతులు, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో నిలదీస్తామని స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో బ్రిక్స్ అవినీతి నిరోధక సదస్సు ప్రారంభం

ఇతివృత్తానికి అనుగుణంగా ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. సభ్య దేశాల మధ్య పారదర్శక పరిపాలన, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, సీమాంతర అవినీతిని అరికట్టడం వంటి కీలక అంశాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించనున్నారు.
ప్రధాన ముఖ్యాంశాలు చర్చనీయాంశాలు
పరారీలో ఉన్న నేరస్తులు, ఆస్తుల రికవరీ: అక్రమంగా విదేశాలకు తరలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నేరస్తుల ఆచూకీ కనుగొనడం, వారి అప్పగింత ప్రక్రియలను వేగవంతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.
డిజిటల్ ఆర్థిక వ్యవస్థ - సవాళ్లు: ఆర్థిక సాంకేతికత డిజిటల్ ఆస్తుల వల్ల ఎదురవుతున్న నూతన అవినీతి ప్రమాదాలను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలు తమ అనుభవాలను, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోనున్నాయి.
నైతిక పరిపాలనపై ప్రత్యేక సదస్సు: ఆగస్టు 5న "ఆవిష్కరణ, సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అనే అంశంపై ప్రత్యేక అనుబంధ సదస్సు జరగనుంది. ఇందులో డిజిటల్ ప్రభుత్వ కొనుగోళ్లు, పారదర్శకత, పౌర భాగస్వామ్యంపై చర్చించనున్నారు.
భారత్ నేతృత్వంలో ఆఖరి సమావేశం -- ఆచరణాత్మక సహకారమే ధ్యేయం
భారత్ అధ్యక్షతన జరుగుతున్న చివరి అవినీతి నిరోధక కార్యాచరణ బృంద సమావేశం ఇదే కావడంతో దీనికి అంతర్జాతీయంగా విశేష ప్రాధాన్యం చేకూరింది. ఈ ప్రతిష్ఠాత్మక సమావేశాల ద్వారా సభ్య దేశాల మధ్య సత్సంబంధాలు బలపడటమే కాకుండా, సాంకేతిక ఆధారిత పరిపాలన, సంస్థాగత సామర్థ్యాల పెంపు మరియు సీమాంతర అవినీతి నిర్మూలనలో సుదీర్ఘకాలిక సహకారానికి బలమైన పునాది పడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భార్యపై భర్త దాడి

జనగాం, ఆగస్టు 3 : జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం ఓబుల కేశవపురం గ్రామంలో కుటుంబ కలహాలు తీవ్ర రూపం దాల్చాయి. భర్త దాడిలో తీవ్రంగా గాయపడినట్లు ఆరోపిస్తూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. తన భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్న విషయాన్ని ప్రశ్నించడంతో తనపై దాడి చేసి, ఇద్దరు పిల్లలను తీసుకెళ్లాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసుల వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి, మాధవి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబంలో విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. భర్తకు మరో మహిళతో సంబంధం ఉందని అనుమానించిన మాధవి ఈ విషయమై నిలదీయగా, ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది.ఈ క్రమంలో తనపై భర్త దారుణంగా దాడి చేశాడని మాధవి ఆరోపించింది. దాడిలో తన చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని, అనంతరం ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తనను హత్య చేయాలని కూడా ప్రయత్నించాడని ఫిర్యాదులో ఆరోపించింది. గాయపడిన మాధవికి వైద్య చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.పిల్లలను తీసుకెళ్లిన ఘటనపై కూడా పోలీసులు విచారణ చేపట్టారు. మహేందర్ రెడ్డి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఆరోపణల నిజానిజాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, విచారణలో వెలుగులోకి వచ్చే ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఆరోపణలపై పూర్తి దర్యాప్తు అనంతరం మాత్రమే వాస్తవాలు నిర్ధారణ అవుతాయని అధికారులు పేర్కొన్నారు.

# కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు సడలించాలి

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఆదివాసీ యువకులపై దాడి చేసిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌ను 24 గంటల్లో సస్పెండ్ చేయాలి**

**లేకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖకు ఆదివాసీల సహాయ నిరాకరణ**

**జన్నారంలో ఘనంగా అఖిలపక్ష సమావేశం**



జన్నారం, ఆగస్టు 03(ప్రజా ముద్ర న్యూస్) :ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కవ్వాల టైగర్ జోన్‌లో అమలు చేస్తున్న కఠిన ఆంక్షలను అటవీ శాఖ తక్షణమే సడలించాలని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ డిమాండ్ చేశారు. ఆంక్షలను సడలించకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖ అధికారులకు ఆదివాసీలు సహాయ నిరాకరణ చేపడతారని హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు అటవీ శాఖ అధికారులు ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. మంచిర్యాల సీఎఫ్, ఎఫ్‌డీపీటీ శాంతారాం సహా పలువురు అధికారుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇందనపల్లి ప్రాంతంలో ఆరుగురు ఆదివాసీ యువకులపై అకారణంగా దాడికి పాల్పడిన ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణను రాబోయే 24 గంటల్లో సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల్లోగా రేంజ్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోకపోతే, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీల సహాయ నిరాకరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. "నేను ప్రభుత్వానికి వ్యతిరేకం కాను, కేవలం అటవీ శాఖలోని కొందరు అధికారుల తీరుకు మాత్రమే వ్యతిరేకం. ఉద్యమం నుంచి వచ్చిన నాయకుడిగా ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాను" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ?ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జన్నారం మండల అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసాక్, జిల్లా కార్యదర్శి ముజాఫర్, వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు బొంతల లక్ష్మణ్ మరియు నాయకులు శంకరయ్య, భూమేష్, లక్ష్మణ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఆర్ట్ గ్యాలరీలో కోరుట్ల ఆర్టిస్టు ద్యావనపెల్లి శంకర్ చిత్రానికి విశిష్ట గుర్తింపు



**కోరుట్ల, ఆగస్టు 03(ప్రజా ముద్ర న్యూస్)** :హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన వారపు సంత కళా ప్రదర్శనలో కోరుట్లకు చెందిన ప్రముఖ ఆర్టిస్టు ద్యావనపెల్లి శంకర్ కాన్వాస్‌పై చిత్రించిన "సంత" అనే కళాఖండం ప్రదర్శనకు ఎంపికైంది."మనసుకి నచ్చిన అందమైన బతుకు చిత్రం" అనే అంశంపై నిర్వహించిన ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని పలువురు కళాకారులు తమ చిత్రాలను ప్రదర్శించగా, మొత్తం 150 మంది ఆర్టిస్టులు పాల్గొన్నారు. వీరిలో 50 మంది కళాకారుల చిత్రాలు మాత్రమే ఎంపికయ్యాయి. అందులో ద్యావనపెల్లి శంకర్ రూపొందించిన "సంత" చిత్రం కూడా చోటు దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు బోలె, జబర్దస్త్ ఫేమ్ మణి, ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ మల్లేశం చేతుల మీదుగా ద్యావనపెల్లి శంకర్‌కు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.కోరుట్ల పట్టణానికి చెందిన ఆర్టిస్టులు ఎక్కల దేవి శేఖర్, డాక్టర్ భోగ శంకర్, న్యాయవాది చాప కిషోర్ తదితరులు ద్యావనపెల్లి శంకర్‌ను అభినందిస్తూ, ఆయన రూపొందించిన "సంత" చిత్రం ఎంపిక కావడం కోరుట్ల పట్టణానికి గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు అంజి, ఆకొండి కాత్రేని కోనతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.






# వెల్దుర్తి మండల కేంద్రంలోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

**గ్రామస్తుల ఆందోళన..**

**విద్యాసంస్థలు మూసివేసి నిరసన**

మెదక్ జిల్లా/వెల్దుర్తి, ఆగస్టు 03(ప్రజా ముద్ర న్యూస్) : వెల్దుర్తి మండలానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామస్తులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలోని విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.మండలానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను కుక్కునూరు గ్రామానికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన గ్రామస్తులు, అలాంటి నిర్ణయం విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లేకపోవడంతో ఇప్పటికే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా, విద్యా సౌకర్యాల పరంగా మండల కేంద్రం అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.అందువల్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తప్పనిసరిగా వెల్దుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, సోమవారం నుంచి ఆందోళనలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.ఈ ఉద్యమానికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని గ్రామస్తులు పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు, మండల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.




# ఆదివాసీలపై దాడి చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పీసీఆర్ ఫౌండేషన్ డిమాండ్..**

జన్నారం, ఆగస్టు 03(ప్రజా ముద్ర న్యూస్) :ఆదివాసీలపై జరిగిన దాడి ఘటనను పీసీఆర్ (పూర్ణచందర్రావు) ఫౌండేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై తక్షణమే స్పందించి బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. బాధిత ఆదివాసులకు న్యాయం జరిగే వరకు పీసీఆర్ ఫౌండేషన్ పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఆదివాసీలపై దాడికి పాల్పడిన వారిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. దర్యాప్తులో ఎవరైనా ఫారెస్ట్ అధికారులు బాధ్యులని తేలితే, వారిపై సంబంధిత చట్టాలతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేయాలన్నారు. బాధితులకు తక్షణమే చట్టపరమైన రక్షణ కల్పించి, న్యాయం అందేలా ప్రభుత్వం వెంటనే స్పందించాలని అన్నారు. బాధితులకు న్యాయం చేకూర్చే క్రమంలో మాకు ఏ బాధ్యత అప్పగించినా స్వీకరించి, వారికి అండగా నిలిచేందుకు పీసీఆర్ ఫౌండేషన్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# నిజామాబాద్ జీజీహెచ్‌కు సూపర్ స్పెషాలిటీ సేవలు

**జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**రిఫరల్ ఆసుపత్రిగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి**

**త్వరలో ఎంఆర్ఐ, సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభం**

**వైద్యులు, నర్సుల నియామకాలపై కీలక ప్రకటన**

హైదరాబాద్, ఆగస్టు 3 ం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే రిఫరల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీతో పాటు పలు సూపర్ స్పెషాలిటీ సేవలను దశలవారీగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఎంఆర్ఐ యంత్రాన్ని కొనుగోలు చేస్తున్నామని, త్వరలోనే ఎంఆర్ఐ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సోమవారం నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది కొరత, అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం గణనీయంగా పెరిగిందని సమావేశంలో ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా, నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో బెడ్ల కోసం ప్రతిరోజూ ప్రజాప్రతినిధులకు పెద్ద సంఖ్యలో వినతులు వస్తున్నాయని తెలిపారు. జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేస్తే హైదరాబాద్ ఆసుపత్రులపై రోగుల ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అవసరాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అంకాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ పీహెచ్‌సీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నందిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా అభివృద్ధి చేయడం, ఇందల్వాయిలో ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటు వంటి ప్రతిపాదనలను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలో వైద్య సేవల బలోపేతానికి ప్రభుత్వం ఇప్పటికే కీలక చర్యలు చేపట్టిందని మంత్రి వెల్లడించారు. ఇటీవల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రుల్లో 18 మంది స్త్రీరోగ నిపుణులు, 22 మంది మత్తు వైద్య నిపుణులు, 22 మంది బాలల వైద్య నిపుణులను నియమించినట్లు తెలిపారు. అదనంగా సుమారు 330 మంది నర్సింగ్ అధికారులకు నియామకాలు ఇచ్చామని, ఈ నెలాఖరులోగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ తదితర విభాగాల్లో నిపుణుల నియామకాలు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానవ వనరులు, మౌలిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు, మందులు, నిర్ధారణ సేవలను సమగ్రంగా బలోపేతం చేస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, వైద్య కళాశాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యం... ప్రభుత్వ బాధ్యత, పౌరుడి నమ్మకం!

**సంపాదకీయం**

ఆరోగ్యం అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. ఆ హక్కును అందరికీ సమానంగా అందించే బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరాల వరకు లక్షలాది మంది ప్రజలు నేటికీ ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారు. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఇవే ప్రధాన వైద్య కేంద్రాలు. అయితే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పూర్తి స్థాయి నమ్మకం ఏర్పడిందా అనే ప్రశ్నకు ఇంకా స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. కొన్ని చోట్ల అత్యుత్తమ సేవలు అందుతున్నా, మరికొన్ని చోట్ల మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది లోపం, నిర్వహణ సమస్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరగాలంటే ముందుగా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలి. ప్రతి ఆసుపత్రిలో పరిశుభ్రమైన వార్డులు, తగిన సంఖ్యలో పడకలు, ఆధునిక వైద్య పరికరాలు, అత్యవసర చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. రోగి ఆసుపత్రిలో అడుగుపెట్టిన క్షణం నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సేవలు అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి. పరిశుభ్రమైన వాతావరణం, సమర్థవంతమైన నిర్వహణ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే మొదటి మెట్టు.వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది కొరత కూడా అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రధాన సమస్యగా మారింది. ఉన్న సిబ్బందిపై అధిక పని భారం పడటంతో రోగులకు తగిన సమయం కేటాయించడం కష్టమవుతోంది. ఖాళీగా ఉన్న పోస్టులను వేగంగా భర్తీ చేయడంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రోత్సాహకాలు అందించాలి. నిరంతర శిక్షణ, ఆధునిక వైద్య పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే చాలా మంది రోగులు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందినవారే. అలాంటి వారికి సరైన మార్గదర్శకత్వం, గౌరవప్రదమైన వైఖరి, స్పష్టమైన సమాచారం అందించడం కూడా ఎంతో ముఖ్యం. రోగులతో మర్యాదగా మాట్లాడటం, వారి సందేహాలను ఓపికగా నివృత్తి చేయడం, చికిత్స విధానాన్ని సులభంగా వివరించడం ద్వారా వైద్యులపై, ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. వైద్య సేవల్లో మానవీయ విలువలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉండాలి.ప్రభుత్వాలు గత కొన్నేళ్లుగా వైద్య రంగంలో గణనీయమైన పెట్టుబడులు పెడుతున్నాయి. కొత్త వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రుల విస్తరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, ఉచిత ఔషధాల పంపిణీ, ఆధునిక నిర్ధారణ పరికరాల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నాయి. ఈ కార్యక్రమాల ఫలితాలు ప్రతి సాధారణ పౌరుడికి చేరినప్పుడే వాటి అసలు లక్ష్యం నెరవేరుతుంది. ఒక ఆసుపత్రి పనితీరును భవనం పరిమాణం కాదు, అక్కడ రోగికి లభించే సేవల నాణ్యత నిర్ణయిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన ప్రజల నమ్మకాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యవసర విభాగాల్లో తగినంత సిబ్బంది, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు,



ప్రాణరక్షక మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రమాదాలు, గుండెపోటు, ప్రసూతి అత్యవసర పరిస్థితుల్లో సమయానికి చికిత్స అందితే వేలాది ప్రాణాలను కాపాడవచ్చు. అందుకే అత్యవసర వైద్య సేవలను మరింత సమర్థంగా తీర్చిదిద్దడం అవసరం.డిజిటల్ సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మరింత మెరుగుపడుతుంది. రోగుల నమోదును డిజిటలీకరించడం, పరీక్షల నివేదికలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం, మందుల నిల్వలను కంప్యూటరీకరించడం, వైద్యుల అపాయింట్‌మెంట్ వ్యవస్థను సులభతరం చేయడం ద్వారా సమయం ఆదా అవుతుంది. పారదర్శకత పెరుగుతుంది. అలాగే దూర ప్రాంతాల్లో ఉన్న రోగులకు టెలి వైద్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై ఉన్న అపోహలను తొలగించడం కూడా అంతే ముఖ్యమైన అంశం. నేటి రోజుల్లో అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక శస్త్రచికిత్సలు, అవయవ మార్పిడి, క్లిష్ట వైద్య సేవలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ విజయాలను ప్రజలకు చేరవేయడం, మంచి సేవల ఉదాహరణలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా విశ్వాసం పెరుగుతుంది. మంచి సేవలను అందిస్తున్న వైద్యులు, సిబ్బందిని ప్రోత్సహించడం కూడా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది.ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్రజలు కూడా ఆసుపత్రి ఆస్తులను సంరక్షించడం, పరిశుభ్రత పాటించడం, వైద్య సిబ్బందితో సహకరించడం వంటి బాధ్యతలను నిర్వర్తించాలి. అదే సమయంలో అధికార యంత్రాంగం ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి లోపాలను సరిదిద్దాలి. ప్రజల అభిప్రాయాలకు విలువ ఇచ్చే ఆసుపత్రులపై సహజంగానే విశ్వాసం పెరుగుతుంది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వ ఆసుపత్రులు వెన్నెముక వంటివి. నాణ్యమైన వైద్య సేవలు, ఆధునిక సదుపాయాలు, సమర్థవంతమైన నిర్వహణ, మానవీయ దృక్పథం, పారదర్శక వ్యవస్థ కలిసివస్తే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. ఆరోగ్య సేవలను వ్యాపారంగా కాకుండా సేవగా భావించే వ్యవస్థ బలోపేతం అయినప్పుడే ప్రతి పౌరుడు ధైర్యంగా ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించే పరిస్థితి ఏర్పడుతుంది. అదే నిజమైన ప్రజారోగ్య విజయానికి నిదర్శనం.

# కలిసి భోజనం.. బలమైన బంధం

## అలవాటు చేసుకోవాల్సిన కుటుంబ సంస్కృతి

డెస్క్, ఆగస్టు 3 : ఒకప్పుడు కుటుంబమంతా ఒకే చోట కూర్చొని భోజనం చేయడం ప్రతి ఇంట్లో సహజమైన దృశ్యం. రోజంతా ఎవరు ఎక్కడ ఉన్నా రాత్రి భోజన సమయానికి అందరూ ఒకేచోట చేరి మాట్లాడుకుంటూ భోజనం చేసేవారు. ఆ సమయంలో కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, పెద్దల సూచనలు, ఆనందాలు, సమస్యలు అన్నీ చర్చకు వచ్చేవి. భోజనం కేవలం ఆకలి తీర్చుకునే ప్రక్రియ మాత్రమే కాదు.. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర అవగాహన పెంచే విలువైన సమయంగా ఉండేది. కానీ ఆధునిక జీవనశైలిలో ఈ సంప్రదాయం క్రమంగా కనుమరుగవుతోంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితం వేగంగా మారిపోయింది. ఉద్యోగాల ఒత్తిడి, పాఠశాలలు, కళాశాలల సమయాలు, వ్యాపారాలు, ప్రయాణాలు, మారిన జీవన విధానం కారణంగా ఒకే సమయంలో ఇంట్లో అందరూ కలిసి ఉండే అవకాశాలు తగ్గిపోయాయి. కొందరు టెలివిజన్ ముందు భోజనం చేస్తుంటే, మరికొందరు మొబైల్ ఫోన్ చూస్తూ తింటున్నారు. ఇంకొందరు తమ గదుల్లో ఒంటరిగానే భోజనం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకునే సమయం తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది.

సాంకేతిక పరిజ్ఞానం మన జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, కుటుంబ అనుబంధాలపై ప్రతికూల ప్రభావం కూడా చూపుతోంది. భోజనం చేస్తున్న సమయంలో కూడా మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, వినోద కార్యక్రమాల్లో మునిగిపోవడం వల్ల పక్కనే ఉన్న కుటుంబ సభ్యులను పట్టించుకునే పరిస్థితి తగ్గుతోంది. రోజంతా ఎదురైన అనుభవాలను పంచుకునే అవకాశం కోల్పోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకోవడానికి అవసరమైన వేదిక క్రమంగా దూరమవుతోంది. కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేయడం వల్ల అనేక మానసిక, సామాజిక ప్రయోజనాలు ఉన్నాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరగడం, తల్లిదండ్రులతో సాన్నిహిత్యం బలపడడం, మంచి సంభాషణా నైపుణ్యాలు అభివృద్ధి చెందడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి. అలాగే పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను కూడా తల్లిదండ్రులు సులభంగా గమనించగలుగుతారు. కుటుంబ సభ్యుల మధ్య నమ్మకం, పరస్పర గౌరవం పెరగడానికి ఈ అలవాటు ఎంతో దోహదపడుతుంది.కలిసి భోజనం చేసే కుటుంబాల్లో పిల్లలు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అలవర్చుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని కుటుంబ సభ్యులతో కలిసి తినడం వల్ల పోషకాహారం తీసుకునే అలవాటు పెరుగుతుంది. బయట ఆహారం, తక్షణ ఆహార పదార్థాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో భోజన సమయంలో ఆహారం విలువ, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి పెద్దలు పిల్లలకు సులభంగా వివరించగలుగుతారు. పిల్లల వ్యక్తిత్వ వికాసంలో కుటుంబ భోజనాల పాత్ర ఎంతో కీలకం. పాఠశాలలో జరిగిన విషయాలు, స్నేహితులతో ఉన్న అనుభవాలు, చదువులో ఎదురవుతున్న



సమస్యలు, భవిష్యత్ లక్ష్యాల గురించి పిల్లలు ఎక్కువగా భోజన సమయంలోనే మాట్లాడే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు కూడా ఆ సమయంలో పిల్లలకు సరైన మార్గనిర్దేశం చేయవచ్చు. దీంతో చిన్న సమస్యలు పెద్దవిగా మారకముందే పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.సంయుక్త కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గిపోవడం కూడా ఈ పరిస్థితికి ఒక కారణంగా చెప్పవచ్చు. గతంలో తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, బంధువులతో కలిసి భోజనం చేసే సంప్రదాయం ఉండేది. పెద్దలు చెప్పే అనుభవాలు, నీతి కథలు, జీవన విలువలు భోజన సమయంలోనే చిన్నారులకు చేరేవి. ఇప్పుడు అణు కుటుంబాలు పెరగడం, అందరూ తమ తమ పనుల్లో నిమగ్నం కావడంతో అలాంటి అనుభవాలు తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితిని మార్చడం అసాధ్యం కాదు. రోజులో కనీసం ఒక పూట అయినా కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేసే అలవాటు చేసుకుంటే ఎంతో మార్పు కనిపిస్తుంది. భోజనం సమయంలో మొబైల్ ఫోన్లు, టెలివిజన్ వంటి పరికరాలను పక్కన పెట్టి పరస్పరం మాట్లాడుకోవడం అలవాటు చేసుకోవాలి. ఒకరి అభిప్రాయాలను మరొకరు వినడం, చిన్న చిన్న విషయాలనైనా పంచుకోవడం కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుంది.వేగవంతమైన జీవితంలో సంపద, సౌకర్యాలు, సాంకేతికత పెరిగినా కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయత తగ్గితే ఆ అభివృద్ధికి పూర్తి అర్థం ఉండదు. పిల్లలకు ఖరీదైన వస్తువులు ఇవ్వడం కంటే తల్లిదండ్రులు తమ సమయాన్ని ఇవ్వడం ఎంతో విలువైనది. కుటుంబంతో కలిసి గడిపే కొన్ని నిమిషాలు జీవితాంతం మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అందుకే భోజనాన్ని కేవలం రోజువారీ కార్యక్రమంగా కాకుండా కుటుంబ బంధాలను బలోపేతం చేసే అవకాశంగా చూడాల్సిన అవసరం ఉంది. కుటుంబంలో కలిసి భోజనం చేసే సంస్కృతి మన సంప్రదాయంలో ఒక గొప్ప విలువ. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా మార్పులు వచ్చినప్పటికీ, ఈ మంచి అలవాటును తిరిగి పునరుద్ధరించడం కాలం కోరుతున్న అవసరం. కుటుంబ సభ్యులు రోజుకు ఒక్క పూట అయినా ఒకే చోట కూర్చొని చిరునవ్వులు పంచుకుంటూ భోజనం చేస్తే అనుబంధాలు మరింత బలపడతాయి. బలమైన కుటుంబ వ్యవస్థే బలమైన సమాజానికి పునాది. ఈ సత్యాన్ని ప్రతి కుటుంబం గుర్తించి ఆచరణలో పెడితే, రాబోయే తరాలకు విలువైన సంస్కృతిని అందించిన వారమవుతాం.

# మంగళగౌరీ వ్రతానికి విశిష్టత



డెస్క్, ఆగస్టు 3 : శ్రావణ మాసంలో వచ్చే తొలి మంగళవారం మొదటి మంగళగౌరీ వ్రతంను వివాహిత మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. సౌభాగ్యం, కుటుంబ సుఖశాంతి, ఆయురారోగ్యాలు, సంతాన శ్రేయస్సు కోసం గౌరీదేవిని పూజించడం ఈ వ్రతం ప్రధాన ఉద్దేశంగా భావిస్తారు. హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండగా, మంగళవారాల్లో గౌరీదేవిని ఆరాధించడం అత్యంత పుణ్యప్రదంగా పురాణాలు పేర్కొంటాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని గౌరీదేవి ఆలయాలు, శివాలయాలు భక్తులతో కళకళలాడనున్నాయి. మంగళగౌరీ వ్రతం ఆచరించే మహిళలు ఉదయాన్నే స్నానాచరణలు పూర్తి చేసి ఇంటిని పరిశుభ్రంగా అలంకరిస్తారు. గౌరీదేవి ప్రతిమ లేదా చిత్రపటాన్ని ప్రతిష్ఠించి పసుపు, కుంకుమ, పూలు, ఆకులు, పండ్లు, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సంప్రదాయబద్ధంగా కలశ స్థాపన చేసి, గౌరీ అష్టోత్తర శతనామావళి, మంగళగౌరీ వ్రత కథను పారాయణం చేస్తారు. అనంతరం హారతులు ఇచ్చి కుటుంబ సభ్యులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు.

పురాణాల ప్రకారం మంగళగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించిన వారికి దీర్ఘ సుమంగళీ యోగం, కుటుంబ ఐక్యత, సంతానాభివృద్ధి, ఐశ్వర్యం కలుగుతాయని విశ్వాసం ఉంది. ముఖ్యంగా కొత్తగా వివాహమైన మహిళలు వరుసగా ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు ఈ వ్రతాన్ని ఆచరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయంగా కొనసాగుతోంది. కొన్నిచోట్ల పెళ్లైన మొదటి శ్రావణ మాసంలో ఈ వ్రతాన్ని అత్తింటివారు ఘనంగా నిర్వహించే ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతోంది. మంగళగౌరీ పూజలో పసుపుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. పసుపుతో గౌరీదేవి రూపాన్ని తయారుచేసి పూజించడం, ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం ఇవ్వడం శుభప్రదంగా భావిస్తారు. కొన్నిచోట్ల మహిళలు కలిసి భజనలు, మంగళహారతులు నిర్వహిస్తూ భక్తి గీతాలు ఆలపిస్తారు. దీంతో ఆలయాలు, ఇళ్లలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

శ్రావణ మాసంలో ప్రకృతి పచ్చదనంతో కళకళలాడే సమయంలో ఈ వ్రతం రావడం విశేషం. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే ఈ కాలంలో మంచి వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కూడా భక్తులు ప్రార్థిస్తారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి, శాంతి, సుఖసంతోషాలు కలగాలని గౌరీదేవిని వేడుకుంటారు. అందువల్ల ఈ వ్రతం ఆధ్యాత్మికతతో పాటు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే సంప్రదాయంగా నిలిచింది. రాష్ట్రంలోని ప్రధాన శివాలయాలు, గౌరీదేవి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు నిర్వహించేందుకు దేవస్థానాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, తాగునీరు, ప్రసాద పంపిణీ, భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించనున్నారు.

మంగళగౌరీ వ్రతం కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదు, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాన్ని పెంపొందించే సామాజిక సంప్రదాయంగా కూడా కొనసాగుతోంది. బంధువులు, పొరుగువారిని ఆహ్వానించి కలిసి పూజలు చేయడం, ప్రసాదాలు పంచుకోవడం ద్వారా పరస్పర అనుబంధాలు మరింత బలపడుతున్నాయి. యువతకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేసే అవకాశంగా కూడా ఈ వేడుక నిలుస్తోంది. ఆధునిక జీవనశైలిలో మార్పులు వచ్చినప్పటికీ మంగళగౌరీ వ్రతంపై భక్తుల విశ్వాసం ఏమాత్రం తగ్గలేదు. నగరాలు, గ్రామాలు అనే తేడా లేకుండా మహిళలు ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నారు. ఆలయాలకు వెళ్లలేని వారు ఇంటి వద్దే కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తున్నారు. డిజిటల్ యుగంలో కూడా వ్రత విధానాలు, పూజా క్రమాలను తెలుసుకుని సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది.

మొదటి మంగళగౌరీ వ్రతం భక్తి, విశ్వాసం, కుటుంబ విలువలు, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. గౌరీదేవి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నెలకొనాలని భక్తులు ప్రార్థిస్తూ ఈ పవిత్ర వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రావణ మాసపు ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ వ్రతం తరతరాలుగా కొనసాగుతున్న విశిష్ట హిందూ సంప్రదాయాల్లో ఒకటిగా విశేష ఆదరణ పొందుతోంది.

# తీపి రుచులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

దెస్క్, ఆగస్టు 3 : ప్రతి సంవత్సరం ఆగస్టు 4న చాక్లెట్ చిప్ కుకీ దినోత్సవం ను ప్రపంచంలోని పలు దేశాల్లో ఆహార ప్రియులు ఆనందంగా జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన తీపి వంటకాల్లో ఒకటైన చాక్లెట్ చిప్ కుకీకి గుర్తింపుగా ఈ ప్రత్యేక దినాన్ని నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులు, చిన్నారులు, బేకరీలు, హోటళ్లు, ఆహార సంస్థలు ఈ సందర్భంగా ప్రత్యేక కుకీలను తయారు చేసి వినియోగదారులకు అందిస్తుంటాయి. రుచితో పాటు సంతోషాన్ని పంచే ఆహారంగా ఈ కుకీకి విశేష ఆదరణ ఉంది. చాక్లెట్ చిప్ కుకీ చరిత్ర దాదాపు తొంభై సంవత్సరాలకుపైగా ఉంది. సాధారణ వెన్న బిస్కెట్ మిశ్రమంలో చిన్న చాక్లెట్ ముక్కలను కలిపి తయారుచేసిన ఈ కుకీలు మొదట అమెరికాలో ప్రాచుర్యం పొందాయి. అనంతరం ప్రపంచవ్యాప్తంగా బేకరీల ద్వారా విస్తరించి అన్ని వయసుల వారిని ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం దాదాపు ప్రతి దేశంలో చాక్లెట్ చిప్ కుకీలు అందుబాటులో ఉండటంతో వాటికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది.

ఈ కుకీల తయారీలో గోధుమపిండి, వెన్న, చక్కెర, గుడ్లు, వెనిల్లా సారం, చాక్లెట్ చిప్స్ వంటి పదార్థాలను ప్రధానంగా ఉపయోగిస్తారు. కొందరు డ్రై ఫ్రూట్స్, బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్ వంటి పదార్థాలను కూడా జోడించి ప్రత్యేక రుచులను అందిస్తున్నారు. ఇటీవలి కాలంలో తక్కువ చక్కెర, సంపూర్ణ ధాన్యాలతో తయారుచేసిన ఆరోగ్యకరమైన కుకీలకు కూడా మంచి ఆదరణ లభిస్తోంది. చాక్లెట్ చిప్ కుకీ దినోత్సవం సందర్భంగా అనేక కుటుంబాలు ఇంట్లోనే కుకీలు తయారు చేసి పిల్లలతో కలిసి ఆనందంగా గడుపుతాయి. చిన్నారులకు వంటపై ఆసక్తి పెంచేందుకు ఈ రోజు ఒక మంచి అవకాశంగా మారుతోంది. పాఠశాలలు, బేకరీ శిక్షణా కేంద్రాలు కూడా కుకీల తయారీపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్నాయి. కుటుంబ సభ్యులంతా కలిసి కుకీలు తయారు చేయడం ద్వారా అనుబంధాలు మరింత బలపడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ బేకరీలు ఈ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, కొత్త రుచులను పరిచయం చేస్తుంటాయి. చిన్న కుకీల నుంచి భారీ పరిమాణంలో తయారుచేసే ప్రత్యేక కుకీల వరకు అనేక రకాల ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్నారు. కొన్నిచోట్ల చాక్లెట్ చిప్ కుకీ తయారీ పోటీలు, రుచి పరీక్ష కార్యక్రమాలు, వంట ప్రదర్శనలు కూడా నిర్వహిస్తారు. ఈ వేడుకలు ఆహార సంస్కృతిలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. చాక్లెట్



చిప్ కుకీలు రుచికరమైనవే అయినప్పటికీ, వీటిలో చక్కెర, వెన్న, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. అందువల్ల పరిమిత మోతాదులో మాత్రమే వీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులకు తరచుగా అధిక పరిమాణంలో తీపి పదార్థాలు ఇవ్వకుండా సమతుల్య ఆహారంతో పాటు అప్పుడప్పుడు మాత్రమే కుకీలు అందించడం మంచిదని చెబుతున్నారు.

ఇటీవలి కాలంలో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో మిల్లెట్లు, ఓట్స్, రాగులు, బెల్లం, తేనె వంటి సహజ పదార్థాలతో తయారుచేసిన కుకీలు కూడా మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. వీటికి ఆరోగ్యాన్ని కోరుకునే వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఆహార పరిశ్రమ కూడా ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలపై మరింత దృష్టి సారిస్తోంది.

చాక్లెట్ చిప్ కుకీ దినోత్సవం కేవలం ఒక తీపి వంటకాన్ని గుర్తు చేసుకునే రోజు మాత్రమే కాదు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆనందాన్ని పంచుకునే సందర్భం కూడా. చిన్న చిన్న కుకీల ద్వారా పెద్ద పెద్ద చిరునవ్వులు పంచుకోవచ్చునే సందేశాన్ని ఈ రోజు తెలియజేస్తుంది. రుచి, సంప్రదాయం, సృజనాత్మకత కలయికగా నిలిచిన చాక్లెట్ చిప్ కుకీ ప్రపంచ ఆహార సంస్కృతిలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. తీపి రుచులను ఆస్వాదించే వారికి ఈ ప్రత్యేక దినోత్సవం మరింత ఉత్సాహాన్ని అందిస్తుంది. అయితే రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని సమతుల్య ఆహార అలవాట్లను పాటించడం ఎంతో అవసరం. ఆనందాన్ని పంచే ఆహారంగా పేరొందిన చాక్లెట్ చిప్ కుకీకి అంకితమైన ఈ రోజు, ప్రపంచ ఆహార వైవిధ్యాన్ని గుర్తు చేసే ప్రత్యేక సందర్భంగా నిలుస్తోంది.

# ప్రజావాణిలో వినతుల స్వీకరణ

కొత్తగూడెం, ఆగస్టు 3 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విని సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించారు. ప్రతి వినతిని నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రధానంగా భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వొద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని, సమస్యల పరిష్కారంలో పారదర్శకతను పాటించాలని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పాలన అందించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై మరింత నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు.





# వేణుకుమార్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

ఖమ్మం, ఆగస్టు 3 : ప్రభుత్వ ఉద్యోగాల గ్రూపుల నియామక ప్రకటనల విడుదలలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి. వేణుకుమార్‌ను బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వేణుకుమార్‌కు అందుతున్న వైద్య చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్న నాయకులు, అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని కోరారు. ఆయన త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. చికిత్సలో ఎలాంటి లోపం ఉండకూడదని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా వేణుకుమార్ రాసిన లేఖను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన నాయనమ్మతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లో మనోధైర్యం కోల్పోవద్దని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.



ఉద్యోగాల నియామకాల అంశంపై యువతలో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం గుర్తించాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగార్థుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని కోరారు. యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. వేణుకుమార్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహకారం అందించాలని నాయకులు ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు. చికిత్స పూర్తయ్యే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కష్టకాలంలో వేణుకుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు. చికిత్సకు అవసరమైన సహాయం అందించడంతో పాటు కుటుంబానికి మానసిక ధైర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. కాగా, వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# కోకాపేటలో పౌర సమస్యల సమీక్ష



హైదరాబాద్, ఆగస్టు 3 : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ‘రోజుకు ఒక వార్డు’ కార్యక్రమంలో భాగంగా కోకాపేట వార్డులో సోమవారం పౌర సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, నార్సింగి డిప్యూటీ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు స్థానిక నివాస సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో రోడ్ల



పరిస్థితి, వర్షపు నీటి కాలువలు, నీరు నిలిచిపోవడం, తాగునీటి సరఫరా వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, దోమల నివారణ చర్యలపై ప్రజలు పలు సూచనలు చేశారు. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు.

వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ సంబంధిత సమస్యలు, ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ ఇబ్బందులు, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. వీధి కుక్కల నియంత్రణ, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, ఆస్తి పన్ను, పేరుమార్పిడి, ఇతర పౌర సేవలకు సంబంధించిన సమస్యలను అధికారులు నమోదు చేశారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కోకాపేట--నియోపోలిస్ ప్రాంతంలో రహదారులు, అనుసంధాన మార్గాల అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను బలోపేతం చేయాలని అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి పరిష్కారం వచ్చే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం లక్ష్యంగా ‘రోజుకు ఒక వార్డు’ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# లిఫ్ట్ పేరుతో దోపిడీ

హైదరాబాద్, ఆగస్టు 3 : ఆల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లిఫ్ట్ ఇస్తామని నమ్మించి ద్విచక్ర వాహనదారుడిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దోపిడీకి పాల్పడిన ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడిని కత్తితో బెదిరించి నగదు, డిజిటల్ చెల్లింపుల ద్వారా డబ్బు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు ముందుగా బాధితుడిని లిఫ్ట్ పేరుతో తమ వెంట తీసుకెళ్లారు. అనంతరం జనసంచారం లేని ప్రాంతానికి చేరుకున్న తర్వాత కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.5,000 నగదును లాక్కున్నారు. అంతటితో ఆగకుండా డిజిటల్ చెల్లింపు వేదిక ద్వారా మరో రూ.800 తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారం ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఆరుగురిని విచారించగా దోపిడీ ఘటనలో వారి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి దోపిడీకి ఉపయోగించిన ఒక కత్తితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను కేసు నమోదు పత్రాల్లో చేర్చి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు చేపట్టారు. అరెస్టు చేసిన నిందితులను వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో ఇలాంటి నేరాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బూత్ కన్వీనర్ శివ శంకర్ యాదవ్ కు పరామర్శ



గోరంట్ల, :గోరంట్ల పట్టణంలోని కొలిమి చింతమాను వీధి 230 బూత్ కన్వీనర్ శివకుమార్ యాదవ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసు కుంటుండగా తెలుగుదేశం పార్టీ సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు వారి ఇంటికి వెళ్లి పరామ ర్శించారు, అలాగే ఆర్థిక సహాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, నిమ్మల శ్రీధర్, బీ రే వేణుగోపాల్ రాయల్, జయరామ్, డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు,మాజీ వార్డు సభ్యులు ఆగిసం నాగరాజు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ ఉమా శంకర్, కురుబ మల్లికార్జున, క్లస్టర్ నరేష్,శ్రీకాంత్, డీలర్ లు మల్లేష్, రమేష్ , త్యాగరాజు, యూనిట్ ఇంచార్జ్ చంద్ర, కలి మ్ ఖాన్, దాదు, చలపతి, తదితరులు ఆర్థిక సహాయం అందజేశారు.

# శివాలయం కాలనీ, రాజీవ కాలనీ లలో ప్రతి ఇంటికీ ప్రతి కుటుంబానికీ అభివృద్ధి సంక్షేమమే మా సందేశం కార్యక్రమం



గోరంట్ల, :రాష్ట్ర మంత్రి వర్యులు సవితమ్మ ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే "ఇంటి-ఇంటికీ తెలుగు దేశం" కార్యక్రమం కు శ్రీకారం చుట్టారు, గోరంట్ల టౌన్ లోని శివాలయం కాలనీ 235, రాజీవ కాలనీ 237 లలో నిర్వహించారు, బూత్ నెంబర్ లలో కుటుంబా లను సందర్శిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించి, మై టిడిపి యాప్ ద్వారా వివరాలను నమోదుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వివరించారు, మండలములో జరుగుతున్న అభివృద్ధి , రోడ్లు, బాలికల హాస్టల్, బాలుర హాస్టలు,త్వరలో అన్నా క్యాంటీన్, త్వరలో త్రాగునీటి ఎద్దడి పరిష్కారం, కోసం మంత్రి సవితమ్మ గారు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు,ఈ కార్యక్రమంలో సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, క్లస్టర్ ఇంచార్జి లు, బూత్ కన్వీనర్లు, డీలర్లు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# ఫోక్సో చట్టం కేసు నిందితుడు అరెస్టు

## కదిరి డిఎస్ పి డి.శివ నారాయణ స్వామి

గోరంట్ల, :గోరంట్ల మండలంలోని సింగిరెడ్డి పల్లి గ్రామంలో ఒక మైనర్ బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేసిన కేసులో తల్లి ఫిర్యాదు మేరకు సీఐ బోయ శేఖర్ ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు, అందులో భాగంగా కదిరి డిఎస్పి శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అనంతరం సోమవారం నిందితుడు హరిజన బాబు (40) నుగుమ్మయ్య గారి పల్లి సమీపంలో అరెస్టు చేసి పెనుగొండ కోర్టుకు డిమాండ్ పంపినట్లు డిఎస్పీ తెలిపారు, డిఎస్ పి తో పాటు ఎస్ ఐ లు రామచంద్ర, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## దానయ్య మృతి కేసులో మలుపు..

అమరావతి ఆగస్టు 03: వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల కాపరి దానయ్య మృతి కేసులో నిందితుడిగా ఉన్న ఆయనను పోలీస్ కస్టడీకి ఇస్తూ శ్రీకాకుళం జిల్లా పలాస కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఒక్కరోజు పాటు ఆయనను పోలీస్ కస్టడీకి అనుమతించింది.ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణకోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలీసులు అప్పలరాజును కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. దానయ్య మృతి కేసులోని కీలక అంశాలు, సంఘటన వెనుక ఉన్న కారణాలపై పోలీసులు ఆయనను ప్రశ్నించే అవకాశం ఉంది.ప్రస్తుతం ఆంపోలు జైలులో రిమాండ్ ఖైదీగా..ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఆంపోలు సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కోర్టు కస్టడీకి అనుమతించడంతో పోలీసులు ఆయనను జైలు నుంచి తీసుకువెళ్లి విచారణ జరపనున్నారు.

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

### అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ ఆధ్వర్యంలో విజయవంతంగా చైతన్య ర్యాలీ
### నగర వీధుల్లో కదం తొక్కిన నర్సింగ్ విద్యార్థినులు
### తల్లిపాల విశిష్టతపై ప్రతిజ్ఞ, మానవహారం

అనంతపురం,:తల్లిపాలతోనే శిశవులకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రి నుంచి భారీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్, పీడియాట్రిక్ డాక్టర్ హరిణి, పీడియాట్రిక్ హెచ్.ఓ.డీ డాక్టర్ రవికుమార్, ఐఏపీ సెక్రటరీ డాక్టర్ శంకర్ నాయక్, పీడియాట్రిక్ డాక్టర్ బాబ్జాన్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు రత్నమయ్య, నరసింహులు నూరు హెల్త్ కేర్ ప్రతినిధి శివయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీను ద్దేశించి ఆర్ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. సృష్టిలో తల్లిపాలకు ఉన్న విశిష్టతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పోతపాలు, డబ్బా పాలు శిశు వులకు ఏమాత్రం ఆరోగ్యకరం కాదని హెచ్చరించారు. శిశువులకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. మాతృత్వం అనేది మహిళలకు దేవుడిచ్చిన గొప్ప వరమన్నారు. అందుకనుగుణంగా ప్రతి స్త్రీ నడచుకోవాలని కోరారు. ప్రసవం అంటే పునర్జన్మతో సమానమని, అంత కష్టపడి పిల్లలను కన్నాక.. పాలు ఇవ్వకపోతే తల్లితనానికే అర్థం ఉండదన్నారు. తల్లి తన పాలను బిడ్డకు తాపించడం వల్ల తల్లి తన సహజ సౌందర్యాన్ని ప్రకృతి సిద్ధంగా తిరిగి పొందగలదని స్పష్టం చేశారు. ఎంతో మంది తల్లులు తమ పిల్లలకు అయి.. మిగిలిన పాలను అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు దానంగా ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన మదర్స్ మిల్క్ బ్యాంక్ రాష్ట్రంలోనే నెంబర్-1 స్థాయిలో నిలబడటం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. సృష్టిలో తల్లిపాలకుమించిన దానం మరొకటి లేదన్నారు. పెద్దాస్పత్రి నుంచి తెలుగుతల్లి విగ్రహం, జిల్లా పరిషత్ మీదుగా సప్తగిరి సర్కిల్కు ర్యాలీ చేరుకుంది. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతిజ్ఞ చేయించారు. అక్కడి నుంచి తిరిగి ర్యాలీ జెడ్పీ మీదుగా ప్రభుత్వాస్పత్రి ప్రధాన గేటు వద్దకు చేరుకుంది. అక్కడ నర్సింగ్ విద్యార్థినులు చేసిన నాటిక అందరినీ ఆకట్టుకుంది.ఆలోచింపజేసింది. కార్యక్రమంలో మిల్క్ బ్యాంక్ స్టాఫ్ నర్సులు సునీత, మానస, బళ్లారి బోయ లావణ్య, కౌన్సెలర్ రాధ, పల్లవి, నాగమణి, సాయి, శంకర్ నారాయణ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.






# కొత్తచెరువులో ప్రత్యేక విక్రయ కేంద్రం ప్రారంభం

### జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి
### మార్కెట్‌లో బియ్యం ధరల నియంత్రణే లక్ష్యంగా 15 మండలాల్లో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు ప్రారంభం
### సబ్సిడీ ధరలకే నాణ్యమైన బియ్యం పంపిణీ
### స్టీమ్ రైస్ బిపిటి కిలో 52, ముడిబియ్యం బిపిటి 50లకే లభ్యం
### ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని పిలుపు



కొత్తచెరువు(పుట్టపర్తి), :కొత్తచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్ఎం. మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి మరియు స్థానిక తహసిల్దార్‌లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకైన బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు మరియు సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూసేందుకు శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది,ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 15 ముఖ్య మండలాల్లో 15 ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ఈరోజు (ఆగస్టు 03) అధికా రికంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.మార్కెట్ వ్యాపారుల కృత్రిమ కొరత, ధరల పెరుగుదలను అరికట్టేందుకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని నిర్ణీత రాయితీ ధరలకు సరఫరా చేస్తోందని అధికారులు తెలిపారు. సూపర్‌ఫైన్ రకం స్టీమ్ రైస్ (బిపి టి): కిలో రూ. 52/-ముడిబియ్యం (బీపి టీ): కిలో రూ. 50/- ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామ న్నారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు సాధారణ స్థితికి వచ్చేవరకు ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలు నిరంతరం పనిచేస్తాయని స్పష్టం చేశారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు సబ్సిడీ ధరలకే బియ్యం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరూ దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కేంద్రాల ద్వారా బియ్యాన్ని కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు అందుబాటులో ఉన్న 15 మండలాలు, రోద్దం,బత్తలపల్లి,సి.కే. పల్లి,గాండ్లపెంట,గోరంట్ల, హిందూపూర్,కదిరి,కొత్తచెరువు, మడకశిర, ముదిగుబ్బ పెనుగొండ పుట్టపర్తి తాడిమర్రి ధర్మవరం లేపాక్షి లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# రూ 64,87 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం



గోరంట్ల, :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్ సవితమ్మ ఆదేశాల మేరకు గోరంట్ల మండలం లోని నార్సింపల్లి పంచాయతీ పరిధిలోని బూడిదగడ్డ పల్లి గ్రామం నందు (ఓవర్ హెడ్ ట్యాంక్) 64,87 అరవై నాలుగు లక్షల ఎనభై ఏడు వేల రూపాయలతో అంచనా వ్యయంతో గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వ హించారు, ఈ కార్యక్రమం లో రాష్ట్ర హాస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్,5 మ్యాన్ కమిటీ మెంబర్ గంగాధర్,గోరంట్ల టౌన్ 6 మ్యాన్ కమిటీ సభ్యులు, నిమ్మల శ్రీధర్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవి నాయక్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి,బీజేపీ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ,మేధారశ్రీనివాసులు,మాజీ సర్పంచ్ ఉత్తమరెడ్డి,మిలిటరి నరసింహాప్ప, శివప్ప, రాజారెడ్డి, దేవరాజ్, చంద్రశేఖర్, నాగ భూషణం గంగాధర్,డీలర్ నాగభూషణం, గంగధర్, నందమోహన్ రెడ్డి, డీలర్ శ్రీనివాసులు, రామచంద్ర, మునే ప్ప, గంగిరెడ్డి, గంగాధర్, నూర్ మహమ్మద్,శ్రీశైలం



శ్రీనివాసులు,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనంతపురం డీఈఓగా డాక్టర్ అయ్యుబ్ హుస్సేన్

అనంతపురం, :అనంతపురం జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ)గా డాక్టర్ ఎన్.అయ్యూబ్ హుస్సేన్ నియమితు లయ్యారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జిల్లాలకు కొత్తగా డీఈఓలను నియమిస్తూ ఆమె ఉత్తర్వులు విడుదల చేశారు. అందులో భాగంగా అనంతపురం డీఈఓగా అయ్యూబ్ హుస్సేన్ ను నియ మించారు.కర్నూలు జిల్లా బి.తాండ్రపాడులోని డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పని చేస్తున్న హుస్సేన్ ను పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఎసీ) అప్పగిస్తూ డీఈఓగా నియమించారు.ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఆయన సోమవారం అనంతపురంచేరుకున్నారు. కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఏడీ-1, 2 కడప మునీర్ ఖాన్, శ్రీనివాసులు, నోడల్ ఆఫీసర్ రాంప్రసాద్, ఏపీఓ మంజునాథ్, ఏఎస్ఓ బోయ శ్రీనివాసులు, ఎయిడెడ్ సెక్షన్ అధికారి జగదీశ్, ఐటీ విభాగం చంద్రశేఖర్రెడ్డి, గుత్తి డిప్యూటీ డీఈఓ లక్ష్మన్న, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ల అసోసియేషన్ ప్రతినిధులు కూడా కొత్త డీఈఓను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.



# తాడిపత్రిలో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం

తాడిపత్రి, : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే అందుబాటులో ఉంచే లక్ష్యంతో తాడిపత్రిలో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని సోమవారం అధికారులు ప్రారంభించారు. తాడిపత్రి పట్టణంలోని పాత తేరు, మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి, తహసీల్దార్ పి. రవిచంద్ర, సీఎస్‌డీటీ పి. మల్లేష్ ప్రసాద్, తాడిపత్రి రైస్ మిల్లర్స్ ప్రతినిధులు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జె.సి. అశ్మిత్ రెడ్డి ప్రత్యేక చొరవతో, మాజీ ఎమ్మెల్యే జె.సి. ప్రభాకర్ రెడ్డి సహకారంతో, తాడిపత్రి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.తాడిపత్రి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు చెందిన అర్హులైన రేషన్ కార్డుదారులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డును చూపించి ప్రతి రేషన్ కార్డుపై గరిష్ఠంగా 10 కిలోల బియ్యాన్ని కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. అవసరాన్ని బట్టి రా బియ్యం లేదా స్టీమ్ బియ్యాన్ని ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం రా (బీపీటీ) బియ్యం కిలో రూ.50, స్టీమ్ (బీపీటీ) బియ్యం కిలో రూ.52 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.ప్రత్యేక విక్రయ కేంద్రం ప్రారంభమైన తొలి రోజే పెద్ద సంఖ్యలో రేషన్ కార్డుదారులు బియ్యం కొనుగోలు చేసి పథకాన్ని వినియోగించుకున్నారని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని అధికారులు పేర్కొన్నారు.అర్హులైన రేషన్ కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీలర్లు ప్రజలు పాల్గొన్నారు.



# గోరంట్ల లో హిందూపురం పట్టణ సీఐ రాజగోపాల్ నాయుడు ను సస్పెండ్ చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా

## తహసిల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన, తహసిల్దార్ కు వినతి

గోరంట్ల, :హిందూపురం సిఐ రాజగోపాల్ నాయుడు ను వెంటనే సస్పెండ్ చేయాలని అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గోరంట్ల పట్టణం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు, అనంతరం తహసిల్దార్ కార్యాలయం చేరుకొని, బైఠాయించి, ధర్నా నిర్వహించి, తహసీల్దార్ మధుసూదన్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు,శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలో సోమవారం రాత్రి మాతృశ్రీ హాస్పిటల్ నందు వైద్యం వికటించి ఒక గర్భిణీ మృతి చెందిన విషయం,మాతృ శ్రీ హాస్పిటల్ సిబ్బంది ఉద్దేశశీ పూర్వకముగా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే ఉద్దేశంతో వైద్యం వికటించి చనిపోయిన ఆమె అయొక్క శవాన్ని మాతృ శ్రీ అనే ప్రైవేట్ ఆసుపత్రి నుండి ప్రభుత్వ ఆసుపత్రికి తరించడం జరిగినదన్నారు,ఫోన్ ద్వారా విషయం తెలుసుకున్న బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ అక్కడికి వెళ్లగా అతని మీద హిందూపురం వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు బూట్ల కాళ్లతో దాడి చేయడం, బ్రోకర్ వా అంటూ రాయలేని భాషలో తిట్టడం జరిగినది.అందుకు నిరసనగా గత రెండు మూడు రోజుల నుండి దళిత సంఘల ఐక్యవేదిక ఆధ్వర్యములో సీఐ రాజగోపాల్ నాయుడు నీ సస్పెండ్ చేయాల న్నారు,వీధుల నుండి తొలగించాలనీ, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు,ఈ కార్యక్రమములో దళిత ఐక్య వేదిక సంఘం సీనియర్ నాయకులు దండోరా నారాయణ, కే ఎన్ బాబు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ ఉమా శంకర్, ఓబుల్ కుమార్, పొంగలి రమణ, వానవోలు చలపతి, పీవీ గంగన్న, పూజారి ఓబులేసు, కలగేరి ఓబులేసు, విజయ్ కుమార్, తిప్పయ్య, గంగప్ప, రమణయ్య, నరసింహులు, వానవోలు చలపతి, బీసీ చంటి, లక్ష్మన్న, గంగాదేవి పల్లి నరసింహులు, గంగాద్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.








# దేవాంగ రాష్ట్ర అభ్యు దయ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎంపీపీ నిమ్మల విద్యా ధరణి కి ఘన సన్మానం

గోరంట్ల, :గోరంట్ల పట్టణం లోని చౌడేశ్వరి కాలనీ శివాలయం కాలనీ చెందిన దేవాంగ కులస్తులు మహిళలు, దేవాంగ రాష్ట్ర అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎంపికైన శుభ సందర్భంగా గోరంట్ల మాజీ ఎంపీపీ నిమ్మల విద్యా ధరణి ని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియ జేశారు.నన్ను ఎంపిక చేసిన సందర్భంగా నాపై ప్రేమాభిమానాలతో మహిళలు బంధు మిత్రులు, శ్రేయోభి లాషులు మరియు దేవాంగ సమాజ సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు, మీరు చూపిన గౌరవం, ఆదరణ నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తున్నాయి. మీ అందరి ఆశీస్సులు, సహకారంతో దేవాంగ సమాజ అభ్యున్నతి, మహిళల సాధికారత కోసం అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇస్తున్నానని ఈ సందర్భంగా విద్యాధరణి తెలియ జేశారు.



# గోరంట్ల లో సబ్సిడీ ధరలకే సన్న బియ్యం పంపిణీ



గోరంట్ల, :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ,చేనేత, జౌళి శాఖల మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద గల ఎల్లమ్మ దేవి మోడరన్ రైస్ మిల్ నందు కూటమి ప్రభుత్వం ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం పంపిణీ కార్యక్రమం ను మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి ప్రారంభించారు,స్టీమ్ బియ్యం(బీపీటీ),బహిరంగ మార్కెట్ ధర 62/-ప్రత్యేక కౌంటర్ ధర 52/-,రా బియ్యం(బీపీటీ)
బహిరంగ మార్కెట్ ధర 58/,ప్రత్యేక కౌంటర్ ధర 50/ ఈ కార్యక్రమానికి 5మ్యాన్ 6 మ్యాన్ కమిటీ సభ్యులు, కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టాకిస్ట్ శ్రీధర్ రావు, హస్త కళల డైరెక్టర్ పులేరు సోమశేఖర్, జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి, సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, బీరే వేణుగోపాల్ రాయల్, జయరామ్,మాజీ సర్పంచ్ ఉత్తమ రెడ్డి,రాజారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, బొట్టు శ్రీనివాసులు, మాజీ వార్డు సభ్యులు ఆగిశం నాగరాజు,మునిస్వామి, రవి నాయక్, డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు,కురుబ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో తల్లిపాల వారోత్సవాలు



తాడిపత్రి, : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తాడిపత్రి పట్టణంలోని ఆసుపత్రి పాలెం, కృష్ణాపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్వాడి వర్కర్స్ జీనత్ భాను, సంతోష్, సురేఖ, మాధవి, రమాదేవి, ప్రసన్నలక్ష్మి, లలిత, నాగరాణి, వరలక్ష్మి, అమృతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకుల ఆధ్వర్యం లో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

గోరంట్ల, :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖా మంత్రి



సవితమ్మ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రజా పరిష్కార వేదిక (గ్రీవెన్స్) గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్, మరియు 5 మ్యాన్ కమిటీ 6 మ్యాన్ కమిటీ నిర్వహించారు,ఈ కార్యక్రమంలో 5 మ్యాన్,6మ్యాన్,కమిటీ సభ్యులు, కూటమి ప్రభుత్వం కి చెందిన ప్రజా ప్రతినిధులు, అర్జీదారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వివిధ భూ సమస్యలు, రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీటి సమస్య, తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు.



## ఆర్ బి కే సిబ్బందితో ఎల్నినో పై ప్రత్యేక సమావేశం

### వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్



తాడిమర్రి, మండల కేంద్రంలోని ఆర్ బి కే లో 10 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏలినో ప్రభావం పై ప్రత్యేక కార్యాచరణ సమావేశం వేశాధికా సేకరణ ఎక్కువ నిర్వహించారు, వారు మాట్లాడుతూ ప్రణాళి కను సిద్ధం చేసి సిద్ధం చేసి ఉదయము 10:00 నుండి సాయంత్రం ఏడు గంటల వరకు ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ సిబ్బంది యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ప్రతి రైతు సేవ కేంద్రంలో ఒక గంట సేపు రైతులను సమావేశపరిచి వర్షాభావ పరిస్థితుల పైన అవగాహన కల్పించి ఈ వర్షాభావ పరిస్థితుల నుండి రైతులు నష్టపోకుండాఆచరించవలసినటువంటి విధి విధానాలపైన సాంకేతిక సాంకేతిక సమాచారాన్ని అందజేసి రైతులతో ర్యాలీ చేయించి మరియు క్షేత్ర ప్రదర్శన చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్ని పాటించుకుని ఏలినో ప్రభావం నుండి బయట పడుటకు మండలంలో ఉదయం నుండి సాయంత్రం వరకు సంచరించ నున్నారు, ఇందులో భాగంగా ఉదయము 10 నుండి 11 గంటల వరకు చిల్లా వారి పల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో 11 నుండి 12 గంటల వరకు దాడి తోట రైతు సేవా కేంద్రం పరిధిలో 12 నుండి ఒక గంట వరకు పెద్దకోట్ల రైతు సేవ కేంద్రం పరిధిలో ఒక గంట నుండి రెండు గంటల వరకు కునుకుంట్ల రైతు సేవా కేంద్రం పరిధిలో రెండు నుండి మూడు గంటల వరకు తాడిమర్రి రైతు సేవ కేంద్రం పరిధిలో మూడు నుండి నాలుగు గంటల వరకు ఎం అగ్రహారం రైతు సేవా కేంద్రం పరిధిలో నాలుగు నుండి ఐదు గంటల వరకు సిసి రేవు రైతు సేవ కేంద్రం పరిధిలో ఐదు నుండి 6 గంటల వరకు నిడిగల్లు రైతు సేవ కేంద్రం పరిధిలో 6 నుండి 7 గంటల వరకు పిన్నదరి రైతు సేవ కేంద్రం పరిధిలో ఈ సాంకేతిక సలహాల టీం పర్యటించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వనున్నారు, కావున మండలంలోని 10 రైతుసేవ కేంద్రాల పరిధిలో రైతు సోదరులు భారీగా పాల్గొని సలహాలు సూచనలు పొందవచ్చు రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా శాస్త్రవేత్తలతో సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చున్నారు, మరొక్కసారి మండలంలోని రైతు సోదరులు ప్రజాప్ర తినిధులు నాయకులు మహిళా రైతులు అందరూ కూడా గమనించగలరు ఈ యొక్క సాంకేతిక సలహాల సమావేశంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలిపారు.

## పుట్టపర్తిలో చెత్త వ్యర్థాలను చిత్రావతి నదిలో వేయవద్దు

### పుట్టపర్తిని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుదాం

### మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి, :పుట్టపర్తి పట్టణంలో పరిశుభ్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెత్తాచెదారం మరియు ఇతర వ్యర్థాలను చిత్రావతి నదిలో వేయకుండా ప్రజలు సహకరించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.సోమవారం చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పర్యటించారు.అక్కడి చెత్త చెదారం , వ్యర్థాలను రోడ్లు, నది పరివాహక ప్రాంతంలో వేయడాన్ని తప్పుబట్టారు. తక్షణం వీటిని తొలగించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టపర్తి పట్టణాన్ని అత్యంత సుందర పట్టణంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి, నదీ తీర ప్రాంతాల్లో చెత్త వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఉండేందుకు ప్రధాన ప్రాంతాల్లో తగిన సంఖ్యలో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అలాగే పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు.చిత్రావతి నది పుట్టపర్తి ఆధ్యాత్మిక, పర్యావరణ పరంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, నదిని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించవచ్చని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు.పుట్టపర్తిని రాష్ట్రంలోనే ఆదర్శ పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ పర్యటనలో సంబంధిత మున్సిపల్ అధికారులు కమిషనర్ శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏ తల్లి కన్న బిడ్డనో..?

**అప్పుడే పుట్టిన మగశిశువును వదిలించుకున్న వైనం**

**బొడ్డూడని, రక్తపు తడి ఆరని శిశువు ఆక్రందనలు విని.. అక్కున చేర్చుకున్న స్థానికులు**

**ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది సహకారంతో అనంతలోని నవజాత శిశుకేంద్రానికి తరలింపు**

**కొనసాగుతున్న మెరుగైన వైద్య సేవలు**

పెనుకొండ/అనంతపురం, :ఏ తల్లి కన్నబిడ్డో మరి.. వీధులపాలయ్యాడు. అప్పుడే పుట్టిన.. ఇంకా బొడ్డూడని, రక్తపు తడి ఆరని మగశిశువును ఓ తల్లి కర్కశంగా వదిలించుకోగా.. గమనించిన స్థానికులు అక్కున చేర్చుకున్నారు. ఒళ్లంతా రక్తం, మట్టితో నిండిపోయిన శిశువును శుభ్రం చేసి.. ఆస్పత్రికి తరలించారు. ఈ హృదయ విదారక ఘటన పెనుకొండ మండలం కియా పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది.





స్థానికులు, అధికారుల కథనం ప్రకారం.. ఉదయమే అమ్మవారిపల్లిలోని ఓ ఆలయం సమీపంలో అటుగా వచ్చిపోతున్న వారికి శిశువు ఏడుపులు వినిపించాయి. అక్కడికి వెళ్లి చూడగా.. అప్పుడే పుట్టిన మగబిడ్డను ఎవరో పారేసి వెళ్లిపోయారు. క్షణాల్లో సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మీ, అంగన్వాడీ వర్కర్ పార్వతమ్మ, ఏఎన్ఎం భారతి, ఆశా వర్కర్ రమణమ్మ, కియా ఏఎస్ఐ హరినాధబాబు వెంటనే తమపై స్థాయి అధికారులకు సమాచారం అందించారు.శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ ప్రమీల దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు పెనుకొండ సీడీపీఓ ధనలక్ష్మీ, పైన పేర్కొన్న సిబ్బంది వెంటనే శిశువును పెనుకొండలోని సీ.హెచ్.సీ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తి లోని శిశుగృహ మేనేజర్ సునీత ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు.

ప్రత్యేక వైద్యబృందం ఆధ్వర్యంలో మెరుగైన సేవలు ....

బొడ్డూడని, రక్తపు తడి ఆరని మగశిశువును అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్ప త్రిలోని నవజాత శిశు కేంద్రానికి తరలించారు. ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జుల హేమలత, పీడియాట్రిక్ డాక్టర్ హరిణి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం మగశిశువును ఐసీయూలో ఉంచి అన్నీ పరీక్షలు చేశారు. ఊపిరి తీసుకోవడానికి శిశువు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. శిశు వుకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. పూర్తిగా కోలుకున్నాక.. శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ ప్రమీల సమక్షంలో ఆ శాఖ అధికారులకు అప్ప గిస్తామని ఆర్ఎంఓ డాక్టర్ హేమలత వెల్లడించారు.

# అర్హులందరికీ నేతన్న సేవలో

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**

**ఏటా చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం**

**ఈ నెల 7 నుంచి పథకం అమలు**

**5 తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు తుది గడువు**

**గడువులోగా చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలి**

**ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో...' అమలు చేస్తున్నాం**

**చేనేతల గౌరవప్రదమైన జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యం**

**పథకం అమలులో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వొద్దు**

**7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు**

**హాజరుకానున్న సీఎం చంద్రబాబు**

**చేనేత, జౌళి శాఖాధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి సవిత**



అమరావతి,: అర్హులైన వారందరికీ నేతన్న సేవలో పథకం వర్తింపజేస్తామని, చేనేతలకు ఆర్థిక భరోసాతో కూడిన గౌరవప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. నేతన్నలకు ఏటా రూ.25 వేలను ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకాన్ని రూపొందించారన్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని, అయిదో తేదీలోగా అర్హులైన చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సవిత కోరారు. రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అదే సమయంలో చేనేతలకు వ్యక్తిగతంగా ఆర్థిక వృద్ధి కలిగేలా పలు సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టామన్నారు. 50 ఏళ్లు నిండిన నేతలన్నకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి లబ్ధి కలిగేలా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మగ్గం మీద నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకూ విద్యుత్ ను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఇవే కాకుండా త్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్రా రుణాలను కూడా అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో...' అమలు...

ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలతో పాటు హామీ ఇవ్వని పథకాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేతకూ ఏడాదికి రూ.25 వేలు అందించనున్నామన్నారు. చేనేత వృత్తిదారులకు ప్రభుత్వ పరంగా అండాలనే ఉద్దేశంతో నూతన పథకానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. చేనేత కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

5 వరకూ దరఖాస్తులకు గడవు...

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశమని మంత్రి సవిత వెల్లడించారు. ఈ నెల అయిదో తేదీ సాయంత్ర అయిదు గంటల్లోకా అర్హులైన నేతన్నలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఆర్థిక సాయం పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ ఏడీలు నేతన్న సేవలో పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మీడియాలోనూ సమాచారమివ్వాలని, వీలైనంత ఎక్కువ మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు లక్ష్య సాధనలో భాగంగా, విమర్శలకు, ఆరోపణలకు తావులేకుండా నేతన్న సేవలో సథకం అమలయ్యేలా అధికారులు పనిచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీ ఉదయానికి అన్ని జిల్లాల నుంచి లబ్ధిదారుల వివరాలు అందజేయాలన్నారు.

7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం...

ఈ నెల ఏడో తేదీన చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఆనాటి వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. అదే రోజు నేతన్న సేవలో పథకానికి ఆయన శ్రీకారం చుడతారన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, చేనేత వస్త్రాల వినియోగంపై ప్ల కార్డులు కూడా ప్రదర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అన్ని జిల్లాల ఏడీలు , ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed And Published Owned By K. Naresh Kumar, Flat No: 309/2, Krishna Plaza, Khairatabad, Hyderabad-50004. TELANGANA STATE, Website: www. prajamudra.Com,